
సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం

శనివారం । 7 । జూన్ । 2025



విశ్వాసానికి ప్రతీక బక్రీద్

జిల్లావ్యాప్తంగా ముస్లింలు మసీదులను ముస్తాబు చేసి భక్తిశ్రద్ధలతో బక్రీద్ పండుగ జరుపుకునేందుకు సిద్ధమయ్యారు. 10లో



103 శాతం బొగ్గు ఉత్పత్తి

సింగరేణి మే నెలలో 103 శాతం బొగ్గు ఉత్పత్తి సాధించింది. ఐదు ఏరియాలు మెరుగైన పనితీరు కనబర్చాయి. 10లో



వాతావరణం

జిల్లాలో శనివారం మధ్యాహ్నం అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. సాయంత్రం వరకు వడగాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

స్వర్ణ కవచధారణలో రామయ్య



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకుడు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్ర స్వామివారి దేవస్థానం అంతరాలయంలోని మూలమూర్తులు శుక్రవారం స్వర్ణ కవచధారులై దర్శనమిచ్చారు. తొలుత తెల్లవారు జామున గర్భగుడిలో స్వామివారికి సుప్రభాత సేవ, సేవా కాలం, ఆరాధన తదితర పూజలు చేశారు. అనంతరం నిత్యకల్యాణానికి బేడా మండపంలో కొలువుదీరిన స్వామి వారికి విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం చేశారు. స్వామివారికి కంకణధారణ, యజ్ఞోపవీత ధారణ, అమ్మవారికి కంకణ, యోక్త్రధారణ గావించి నిత్యకల్యాణ ఘట్టాన్ని ఆలయ అర్చకులు శాస్త్రోక్తంగా జరిపారు. భక్తులు స్వామివారిని దర్శించుకుని తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. శుక్రవారం సందర్భంగా శ్రీ లక్ష్మీతాయారు అమ్మవారి ఆలయంలో అభిషేకం, ప్రత్యేక పూజలను గావించారు.

పర్ణశాల హుండీ లెక్కింపు

దుమ్ముగూడెం: పర్ణశాల శ్రీ సీతారామ ఆలయ దేవస్థానంలో శుక్రవారం హుండీ కానుకలు లెక్కించారు. నెల రోజులకు గాను రూ. 7,35,728 ఆదాయం సమకూరిందని ఈఓ రమాదేవి తెలిపారు. చివరిసారిగా గత నెల 7న ఆలయ హుండీ కానుకలు లెక్కించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ భవాని రామకృష్ణ, వెంకటేశ్వరరావు, అనిల్ కుమార్, స్వచ్ఛంద సంస్థ సేవకులు, స్టేట్ బ్యాంక్ సిబ్బంది పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లికి పంచామృతాభిషేకం



పంచామృతాభిషేకం చేస్తున్న అర్చకులు

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి అమ్మవారికి శుక్రవారం వైభవంగా పంచామృతాభిషేకం నిర్వహించారు. మండలంలోని శ్రీకనకదుర్గ (పెద్దమ్మతల్లి) ఆలయంలో అర్చకులు అమ్మవారి జన్మస్థలం వద్ద పంచామృతం, పసుపు, కుంకుమ, గాజులు, హారతి సమర్పించారు. అనంతరం ఆలయంలోని మూలవిరాట్‌కు పంచామృతంతో అభిషేక పూజలు, పంచహారతులు, నివేదన, నీరాజనం, మంత్రపుష్పం పూజ, కుంకుమపూజ, గణపతిహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఈఓ ఎన్.రజనీకుమారి, అర్చకులు పాల్గొన్నారు.

లాసెట్ ప్రశాంతం



హాల్ టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

సుజాతనగర్: న్యాయ విద్య కోర్సుల్లో ప్రవేశాల కోసం నిర్వహించే టీజీ లాసెట్ పరీక్ష అబ్దుల్ కలాం ఇంజనీరింగ్ కళాశాలలో శుక్రవారం ప్రశాంతంగా ముగిసింది. మూడు షిఫ్ట్‌లలో పరీక్ష నిర్వహించగా, మొదటి షిఫ్ట్‌లో 103, రెండో షిఫ్ట్‌లో 112, మూడో షిఫ్ట్‌లో 109మంది హాజరైనట్లు నిర్వాహకులు తెలిపారు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- ఎస్పీ రోహిత్‌రాజు

సూపర్‌బజార్(కొత్తగూడెం): పరస్పరం మతాలను గౌరవించుకుంటూ శాంతియుత వాతావరణంలో పండుగలను జరుపుకోవాలని ఎస్పీ రోహిత్‌రాజు శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. త్యాగానికి ప్రతీకగా ముస్లింలు జరుపుకునే బక్రీద్ పర్వదినం కోసం అన్ని భద్రతా ఏర్పాట్లు పూర్తి చేసినట్లు తెలిపారు. మున్సిపల్, వెటర్నటీ, విద్యుత్ తదితర శాఖలతో సమన్వయం చేసుకుని ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అసౌకర్యం కలుగకుండా చర్యలు చేపడుతున్నామని పేర్కొన్నారు. ముస్లింలు భారీ సంఖ్యలో హాజరయ్యే సామూహిక ప్రార్థనా సమయాల్లో ముందస్తు జాగ్రత్తగా ప్రధాన కూడళ్లలో పోలీస్ పికెట్లు, పర్యవేక్షణ, నిఘా వ్యవస్థను ఏర్పాటు చేశామని తెలిపారు. పాడి ఆవులను, లేగ దూడలను విక్రయించొద్దని సూచించారు.

పద్దులో పెట్టారు.. ప్రణాళిక కావాలి

కార్పొరేషన్‌గా పేర్కొంటూ బోర్డుల ఏర్పాటు, డివిజన్ల పునర్విభజనపైనే అధికారులు దృష్టి సారించారు. దీంతోపాటు ప్రస్తుత ఆర్థిక సంవత్సర రాష్ట్ర బడ్జెట్‌లో కొత్తగూడెం కార్పొరేషన్‌కు కేటాయించిన నిధులను నగర అభివృద్ధికి ఉపయోగించేందుకు వీలుగా త్వరితగతిన ప్రణాళిక రూపొందించాల్సిన అవసరముంది.

–సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం

- రాష్ట్ర బడ్జెట్‌లో కొత్తగూడెం కార్పొరేషన్‌కు నిధులు
- పూర్తి కావొస్తున్న తొలి త్రైమాసికం.. ఇటీవల గెజిట్ విడుదల
- అభివృద్ధి ప్రణాళికతో పద్దులో నిధులు వినియోగించుకునే అవకాశం
- కమిషనర్‌గా ఐఏఎస్ అధికారి కావాలంటున్న ప్రజలు



కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం

బడ్జెట్‌లో ప్రత్యేక పద్దు

కొత్తగూడెం – పాల్వంచ మున్సిపాలిటీలు, సుజాతనగర్ మండల పరిధిలో ఏడు గ్రామపంచాయితీలను ఏకం చేస్తూ కొత్తగూడెం కార్పొరేషన్ ఏర్పాటు బిల్లును గత మార్చిలో జరిగిన బడ్జెట్ సమావేశాల్లో ప్రవేశపెట్టారు. ఆ సమావేశాల్లోనే కొత్తగా కార్పొరేషన్లుగా అప్‌గ్రేడ్ అయిన మంచిర్యాల, మహబూబ్‌నగర్‌లతోపాటు కొత్తగూడెం నగరాభివృద్ధితోపాటు వివిధ పద్దుల కింద రమారమీ రూ.1,000 కోట్ల నిధుల కేటాయించారు. అయితే శాసనసభ, తర్వాత శాసన మండలి, అనంతరం గవర్నర్ ఆమోదం పొంది కార్పొరేషన్ గెజిట్ విడుదలయ్యే సరికి దాదాపు మూడు నెలల సమయం పట్టింది. మరోవైపు బడ్జెట్ అమల్లోకి వచ్చాక తొలి త్రైమాసికం పూర్తి కావొస్తుంది. రెండో త్రైమాసికం నాటికైనా కొత్తగూడెం నగర పాలిక అభివృద్ధి ప్రణాళిక సిద్ధమైతే ఆ తర్వాత దశల్లో పనులను పట్టాలెక్కించేందుకు ఆస్కారం ఉంటుంది. లేదంటే బడ్జెట్ కేటాయింపు ఫలాలు పూర్తి స్థాయిలో దక్కేది సందేహాస్పదం అవుతుంది.

ప్రతిపాదనలు సిద్ధం

డిస్ట్రిక్ట్ మినరల్ ఫండ్ నుంచి ఇప్పటికే పాల్వంచ, కొత్తగూడెం మున్సిపాలిటీలకు వేర్వేరుగా రూ. 40 కోట్లు మంజూరయ్యాయి. వీటితో పాటు ఈ రెండు పట్టణాల్లో వివిధ అభివృద్ధి పనులకు స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ కోసం ప్రతిపాదనలు రూపొందించారు. ఇప్పుడు రెండు పట్టణాలు, సుజాతనగర్‌లు కలిసి నగర పాలికగా మారినందున మూడు ప్రాంతాల ఉమ్మడి అవసరాలను దృష్టిలో ఉంచుకుని కొత్తగా ప్రతిపాదనలు రూపొందించాల్సిన అవసరం ఉంది. కొత్తగూడెం-పాల్వంచ పట్టణాల ఉమ్మడి అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూ. 450 కోట్లతో కొత్తగూడెం రింగ్‌రోడ్డు కోసం ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేశారు. ఈ పనులు త్వరితగతిన పట్టాలెక్కేలా చర్యలు తీసుకోవాల్సి ఉంది. చాన్నాళ్లుగా అసంపూర్తిగా ఉన్న ఖమ్మం – తిరువూరు – పాల్వంచ రోడ్లను కలిపే బైపాస్ రోడ్డుకు సంబంధించి రామవరం దగ్గర గోధుమ వాగుపై వంతెన నిర్మాణ పనులపైనా దృష్టి పెట్టాల్సి ఉంది. రూ. 124 కోట్లతో చేపట్టిన అమృత్ తాగునీటి పథకం పనుల్లో వేగం పెంచడం, అసంపూర్తిగా మిగిలిన సుజాతనగర్ దగ్గర సింగభూపాలెం, పాల్వంచ పట్టణంలో చింతల చెరువు సుందరీకరణ పనులు చక్కబెట్టాల్సి ఉంది. వీటితో ప్రగతి మైదాన్‌లో ఇండోర్ స్టేడియం, కార్పొరేషన్ ఫంక్షన్ హాళ్ల నిర్మాణం చేపట్టాల్సి ఉంది.

అథారిటీ కూడా వస్తే..

నగరపాలిక అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ (కుడా)ను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం జీవో జారీ చేసింది. అయితే ఇప్పటి వరకు పాలక మండలిని ప్రకటించలేదు. ప్రభుత్వ, ప్రైవేటు రంగంలో నిధులు సమీకరించి వివిధ అభివృద్ధి పనులు చేపట్టాల్సిన బాధ్యత కుడాపై ఉంటుంది. నగర అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఆటోనగర్, ఐటీ హబ్, ఇండస్ట్రియల్ పార్క్, ఆర్టీసీ బస్ స్టేషన్ పునర్ నిర్మాణం, జూపార్క్‌లకు ప్రతిపాదనలు సిద్ధం చేశారు. కార్పొరేషన్, కుడాల ఆధ్వర్యంలో ఈ పనులపై ఫోకస్ చేయాలి.

ఐఏఎస్‌ను నియమిస్తే మేలు

సాధారణంగా కొత్తగా ఏర్పాటైన కార్పొరేషన్లకు కనీసం గ్రేడ్–1 లేదా స్పెషల్ గ్రేడ్ ఆఫీసర్లను కమిషనర్లుగా నియమించాల్సి ఉంది. లేదంటే అడిషనల్ కలెక్టర్, ఆపై స్థాయి అధికారులు కమిషనర్లుగా రావాల్సి ఉంది. కమిషనర్ హోదాలో ఉన్న అధికారే (కొత్తగూడెం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ)కుడాకు వైస్ చైర్మన్‌గా వ్యవహరించాల్సి ఉంటుంది. ప్రస్తుతం గ్రేడ్–2 ఆఫీసర్‌గా ఉన్న సుజాతను కొత్తగూడెం కార్పొరేషన్‌కు కమిషనర్‌గా నియమించడం పట్ల నగర ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. మారిన రూపురేఖలు, పెరిగిన అభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలు రూపొందించడం, అవి వేగంగా అమలయ్యేలా వివిధ విభాగాలను సమన్వయం చేయాల్సి ఉంటుంది. దీంతో ఐఏఎస్ లేదా గ్రూప్ వన్ అధికారులకు కొత్తగూడెం నగర పాలనబాధ్యతలు అప్పగించాలనే డిమాండ్ వినిపిస్తోంది.

అసంబద్ధంగా విభజన!

- అడ్డగోలుగా మున్సిపల్ డివిజన్ల ఏర్పాటు ప్రక్రియ
- నిబంధనలు పాటించలేదని ఆరోపణలు
- అసంతృప్తితో అధికారులకు మాజీ ప్రజా ప్రతినిధుల వినతులు
- 11 వరకు అభ్యంతరాలు, సూచనల స్వీకరణ

కొత్తగూడెంఅర్బన్: కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల విభజన ముసాయిదాపై అభ్యంతరాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వం విడుదల చేసిన ముసాయిదాపై మాజీ వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీలు, సంఘాల నాయకులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. నిబంధనలకు విరుద్ధంగా విభజన చేశారని, మార్పులు చేయాలని కోరుతున్నారు. నియోజకవర్గంలో గులాబీ పార్టీ మాజీ వార్డు కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ఆశావాహులు ఉన్న వార్డుల్లో విభజన ప్రక్రియ ఎర్రజెండా పార్టీ నాయకులు, అనుచరులకు అనుకూలంగా జరిగిందనే ఆరోపణలు వస్తున్నాయి. ఈ నెల 11వ తేదీ వరకు అభ్యంతరాలు, సూచనల స్వీకరణ కార్యక్రమం ఉన్నందున అన్యాయం జరిగిందని భావించిన వారంతా కూడా వినతులు ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. అధికారులు పరిశీలించి మార్పులు, చేర్పులు చేయాలని, లేకపోతే ఆందోళనకు కూడా వెనుకాడమని చెబుతున్నారు. అన్ని వర్గాలు, పార్టీలకు ఆమోదయోగ్యంగా ఉండేలా సరిచేయాలని కోరుతున్నారు. ప్రజాప్రతినిధులు కొందరికి మేలు చేయాలని, మరికొందరికి కీడు చేయాలనే ఆలోచన మానుకోవాలని, అధికారులపై ఒత్తిడి లేకుండా వారి పని వారిని చేసుకోనివ్వాలని పేర్కొంటున్నారు.

అభ్యంతరాలు ఇలా...

కొత్తగూడెం మున్సిపల్ కార్పొరేషన్ డివిజన్ల విభజన సరిగ్గా జరగలేదని పాల్వంచ, కొత్తగూడెం, సుజాతనగర్‌లోని ఏడు పంచాయతీల ప్రజలు పేర్కొంటున్నారు. గురువారం నుంచి అభ్యంతరాలు స్వీకరిస్తుండగా ఇప్పటివరకు ఆరు అభ్యంతరాలు వచ్చాయి. కొత్తగూడెం పట్టణంలో 29 డివిజన్లు ఏర్పాటు చేయగా, విభజన అసంబద్ధంగా ఉందని పేర్కొంటున్నారు. ఒకే వీధిలో ఎదురురెదురుగా ఉన్న ఇళ్లు, పక్కపక్కన ఉన్న ఇళ్లను రెండు డివిజన్లుగా చేశారని అధికారులకు వినతులు అందించారు. అటు చివర, ఇటు చివర ఇళ్లు ఒక డివిజన్‌లో, మధ్యలో ఇళ్లు మరో డివిజన్‌లో చేర్చారనే ఆరోపిస్తున్నారు. కొందరికి అనుకూలమైన కమ్యూనిటీల ఇళ్లను ఒక డివిజన్‌లో కలిపారని ఆరోపిస్తూ 21వ వార్డు మాజీ కౌన్సిలర్ కమిషనర్‌కు విన్నవించారు. సుజాతనగర్ మండలంలోని ఏడు పంచాయతీల్లో ఒక గ్రామాన్ని రెండుగా చీల్చి డివిజన్లు ఏర్పాటు చేశారని చెబుతున్నారు. నిమ్మలగూడెం, కోమటిపల్లి పంచాయతీలను 39వ డివిజన్, లక్ష్మీదేవిపల్లి పంచాయతీలను 42వ డివిజన్‌లో కలిపారని, దీని వల్ల దళిత, గిరిజనులకు అన్యాయం, అభివృద్ధికి ఆటంకం జరిగే అవకాశం ఉందని స్థానికులు కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. లక్ష్మీదేవిపల్లి, నిమ్మలగూడెం, కోమటిపల్లి మూడు గ్రామ పంచాయతీలను ప్రత్యేక డివిజన్‌గా ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. ఇక పాల్వంచలో ఫోరం ఫర్ బెటర్ పేరుతో కమిటీ ఏర్పాటైంది. పాల్వంచకు ప్రత్యేక గుర్తింపు ఇవ్వాలని, గతంలో ఉన్న కార్యాలయాన్నీ తరలిపోయాయని, దీంతో పాల్వంచ మనుగడ ప్రశ్నార్థకంగా మారే అవకాశం ఉందని పలువురు పేర్కొంటున్నారు. ప్రస్తుతం పాల్వంచ మున్సిపాలిటీని కూడా కొత్తగూడెం కార్పొరేషన్‌లో కలపడంతో అక్కడి ఘన చరిత్రను మరుగు పడుతుందని చెబుతున్నారు. పాల్వంచ డివిజన్ల విభజన కూడా నిబంధనలకు విరుద్ధంగా జరిగిందని పేర్కొంటున్నారు. కాగా కార్పొరేషన్ డివిజన్ల విభజనపై వివరణ కోరేందుకు ఫోన్ ద్వారా ప్రయత్నించగా.. మున్సిపల్ కమిషనర్, స్పెషల్ ఆఫీసర్‌ను స్పందించలేదు.

సాధారణ ప్రసవాలు జరిగేలా చూడాలి

భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్



మాట్లాడుతున్న ఐటీడీఏ పీఓ రాహుల్

చర్ల: ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో పనిచేసే సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్లు సమన్వయంతో పనిచేయాలని, గర్భిణులు ప్రభుత్వాస్పత్రుల్లోనే సాధారణ ప్రసవాలు పొందేలా చూడాలని భద్రాచలం ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి.రాహుల్ సూచించారు. శుక్రవారం ఆశా డే సందర్భంగా మండలంలోని కొయ్యూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్య సిబ్బంది నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. వాతావరణ మార్పుల వల్ల సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, గ్రామాలో జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో గిరిజనులకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించాలన్నారు. రోడ్లపై, డ్రెయినేజీల్లో చెత్తాచెదారం, మురుగు పేరుకుపోకుండా వివరించాలన్నారు. ప్రభుత్వ వైద్యశాలలో సరిపడా మందులు అందుబాటులో ఉంచుకోవాలని, డాక్టర్లు, సిబ్బంది స్థానికంగా ఉండాలని ఆదేశించారు. అనంతరం వైద్యశాలలోని రికార్డులను పరిశీలించారు. డిప్యూటీ డీఎంహెచ్ఓ డాక్టర్ చైతన్య, డాక్టర్ హారిక, డాక్టర్ స్పందన, డాక్టర్ సచిన్, సూపర్‌వైజర్లు ప్రసాద్, దుర్గ, ఆశా వర్కర్లు వైద్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు సత్వరమే పరిష్కరించాలి

కలెక్టర్ జితేష్ వి.పాటిల్



మిట్టగూడెం గ్రామసభలో దరఖాస్తుదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్



చిన్నారులకు నోట్ పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న కలెక్టర్

అశ్వాపురం/కరకగూడెం: భూ భారతి రెవెన్యూ సదస్సులో వచ్చిన దరఖాస్తులను తహసీల్దార్లు సత్వరమే సమస్యలను పరిష్కరించాలని కలెక్టర్ జితేష్ వి.పాటిల్ అన్నారు. మండల పరిధిలోని మిట్టగూడెం గ్రామంలో భూ భారతి రెవెన్యూ సదస్సును శుక్రవారం ఆయన పరిశీలించారు. దరఖాస్తుల స్వీకరణ, హెల్ప్ డెస్క్‌లు, రిజిస్టర్లను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. దరఖాస్తుదారులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. అనంతరం బైక్‌పై వెళ్లి మిట్టగూడెం గ్రామ పంచాయతీ డంపింగ్ యార్డును సందర్శించారు. పంచాయతీ సిబ్బంది, గ్రామస్తులకు బయోచార్‌పై అవగాహన కల్పించారు. గ్రామంలోని కొర్రమీను చేపల పెంపకం యూనిట్‌ను సందర్శించి, నిర్వాహకులు కొర్సా సోని, దుర్గారావు దంపతులను అభినందించారు. ఆ తర్వాత ఉపాధి హామీలో నిర్మించిన ఫామ్‌పాండ్‌ను పరిశీలించారు. అనంతరం కరకగూడెం మండల కేంద్రంలోని జెడ్పీ పాఠశాల ఆవరణలో జరుగుతున్న నవోదయ పాఠశాల నిర్మాణ పనులను పరిశీలించారు. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో బడిబాట కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సదస్సులో ప్రజలు ఇచ్చే ప్రతి దరఖాస్తును స్వీకరించాలని, సానుకూలంగా ఉన్న సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. అక్షర జ్ఞానంతోనే సామాజిక అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ పేర్కొన్నారు. జవహర్ నవోదయ విద్యాలయ ప్రారంభోత్సవానికి ఏర్పాట్లు పూర్తయ్యాయని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు పిలుపునిచ్చారు. కరకగూడెం నుంచి తిరిగొస్తున్న క్రమంలో బంగారుగూడెంలో రహదారిపై ఆరబోసిన ఇప్పగింజలను కలెక్టర్ పరిశీలించారు. గిరిజన మహిళలతో ముచ్చటించారు. చిన్నారులకు నోటు పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమాల్లో డీఈఓ వెంకటేశ్వరాచారి, నాగరాజశేఖర్, తహసీల్దార్లు రాజారావు, వట్టం కాంతయ్య, ఎంఈఓ మంజుల, ఎంపీడీఓ ముత్యాలరావు, ఏపీఓ సీతారామయ్య, ఏపీఎం సత్యనారాయణ తదతరులు పాల్గొన్నారు.

కిన్నెరసానికి మరో మూషిక జింక



డీర్ పార్కులో అప్పగించిన మూషిక జింక

పాల్వంచరూరల్/సుజాతనగర్/కొత్తగూడెంఅర్బన్: కిన్నెరసాని డీర్ పార్కులోకి శుక్రవారం మరో మూషిక జింక వచ్చి చేరింది. ఇప్పటికే ఇక్కడ మూడు మూషిక జింకలు ఉండగా మరో జింక రావడంతో ఆ సంఖ్య నాలుగుకు పెరిగింది. సుజాతనగర్ మండలం లక్ష్మీదేవిపల్లితండాలో ఓ రైతు పొలంలో ముంగిస దాడిలో గాయపడ్డ మూషిక జింకకు రామవరంలోని పశువైద్యశాలలో చికిత్స అందించి, అనంతరం యానంబైల్ రేంజ్‌లోని కిన్నెరసాని డీర్ పార్కుకు చేర్పినట్లు రేంజర్లు శ్రీనివాసరావు, వెంకటేశ్వర్లు తెలిపారు.

వీధి కుక్కలు.. వానర మూకలు ప్రాణాలు తీస్తున్నాయ్..



వీధి కుక్కలు, కోతుల మూకలు ప్రజలు ప్రాణాలు తీస్తున్నాయి. దాడి చేసి పలువురిని గాయపరుస్తున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వీధుల్లో తిరగలేని పరిస్థితి నెలకొంటోంది. ఇక చిన్నారులు ఆరు బయట ఆడుకునే సమయంలో ఎక్కడ కుక్కలు దాడి చేస్తాయేమోనని ఆందోళన చెందాల్సివస్తోంది. కుక్కల దాడిలో ఇటీవల ఇద్దరు చిన్నారులు మృతి చెందారు. కోతులు ఇంటింటా కిష్కింధకాండ సృష్టిస్తున్నాయి. మూకుమ్మడిగా దాడికి దిగుతుండటంతో పలువురు గాయాలపాలవుతున్నారు.

–సూపర్‌బజార్(కొత్తగూడెం)

- కుక్కకాటుతో ఇద్దరు చిన్నారుల మృతి
- కోతుల దాడిలో గాయపడ్డ ట్యాక్సీ డ్రైవర్
- చికిత్స పొందేందుకు భారీగా ఖర్చు
- నియంత్రణ చర్యలు చేపట్టాలని కోరుతున్న ప్రజలు



రామవరంలో 12 ఏళ్ల బాలుడు

కొత్తగూడెం రామవరంలో 12ఏళ్ల బాలుడు ఆడుకుంటుండగా కొంత కాలం క్రితం వీధికుక్క కరిచింది. తల్లిదండ్రులకు భయపడి బాలుడు ఇంట్లో చెప్పలేదు. ఫిబ్రవరిలో వర్షాలు కురిశాక బాలుడు తీవ్ర అస్వస్థతకు గురయ్యాడు. తల్లిదండ్రులు ఆరా తీయగా కుక్క కరిచిన విషయం చెప్పాడు. అప్పటికే పరిస్థితి చేయిదాటిపోయింది. స్థానిక ఆస్పత్రిలో, వరంగల్ ఎంజీఎం ఆస్పత్రిలో చికిత్స అందించినా ఫలితం దక్కలేదు. కుక్క కరవడంతో బాలుడు మృతి చెందాడని వైద్యులు ధ్రువీకరించారు. అల్లారు ముద్దుగా పెంచుకుంటున్న కుమారుడు మృతి చెందడంతో తల్లిదండ్రులకు గర్భశోకం మిగిలింది. కాగా రామవరంలోనే కాంట్రాక్టు కార్మికులుగా విధులు నిర్వహించే ఒకే కుటుంబానికి చెందిన బాబాయి, కూతురు కూడా కుక్కకాటుకు గురయ్యారు.

జిల్లా కేంద్రంలో సమస్య తీవ్రం..

జిల్లావ్యాప్తంగా కోతులు, కుక్కలు బీభత్సం సృష్టిస్తూ ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. వివిధ పనులకు నిమిత్తం బయటకు వెళ్లివచ్చేవారిపై కుక్కలు ఎగబడి దాడి చేస్తున్నాయి. ద్విచక్రవాహనాలపై వెళ్లే వారిని కూడా తరమడంతో కిందపడి గాయపడుతున్నారు. ఇక తలుపు తెరచి ఉంటే చాలు కన్నుమూసి తెరిచేలోపు ఇంట్లో ఆహార పదార్థాలను కోతులు ఎత్తుకుపోతున్నాయి. వెళ్లగొడుతుంటే ఎగబడుతున్నాయి. రక్షించుకునే క్రమంలో పలువురు కిందపడి గాయపడుతున్నారు. ఈ సమస్య పల్లె, పట్టణం అనే తేడా లేకుండా జిల్లావ్యాప్తంగా ఉంది. జిల్లా కేంద్రంలోని రామవరం తదితర ప్రాంతాల్లో మరింత తీవ్రంగా ఉంది.



కోతుల దాడిలో గాయాలు.. వైద్యానికి రూ.4 లక్షలు

గత ఏప్రిల్ 4న రామవరానికి చెందిన ట్యాక్సీ డ్రైవర్ అబ్దుల్ సలీం ఇంట్లో కోతుల నానారభస సృష్టించాయి. కుటుంబ సభ్యులపై దాడిచేశాయి. ఇంటి యజమాని కర్ర పట్టుకుని కో తులను బెదరగొట్టే ప్రయత్నం చేయగా, మూకుమ్మడిగా తిరగబడ్డాయి. దీంతో భయపడి ఇంట్లోకి పరుగెత్తుతుండగా గడప తాకి కిందపడ్డాడు. తలకు దెబ్బతగిలి తీవ్ర గాయాలు కావడంతో స్థానికంగా, ఖమ్మంలో చికిత్స పొందాడు. తలకు ఆపరేషన్ చేసి 53 కుట్లు వేశారు. ఇందుకోసం రూ. 4లక్షల వరకు ఖర్చయిందని కుటుంబీకులు తెలిపారు. కొద్దిరోజుల తర్వాత మరో ఆపరేషన్ చేయాలని, ఇందుకోసం ఇంకా రూ. లక్షలు ఖర్చవుతుందని వైద్యులు పేర్కొన్నట్లు బాధితుడు చెప్పాడు. కారు నడుపుతూ జీవనం సాగించే సలీం రెండు నెలలుగా ఆస్పత్రుల చుట్టూ తిరుగుతున్నాడు. కారు నడిపే వీలులేకపోవడంతో కుటుంబం అప్పులపాలవుతోంది.



కోతుల దాడిలో గాయపడ్డ సలీంకు ఆపరేషన్ చేసి కుట్లు వేసిన దృశ్యం

సుజాతనగర్‌లో ఐదేళ్ల బాలిక



చిన్నారి నిహారిక (ఫైల్)

సుజాతనగర్ మండల పరిధిలోని లక్ష్మీదేవిపల్లి గ్రామానికి చెందిన బానోత్ రమేష్, స్వప్న దంపతుల ఐదేళ్ల కుమార్తె నిహారిక గాయత్రి గత నెల 13న ఇంటి ముందు ఆడుకుంటుండగా పిచ్చి కుక్క కరిచింది. తీవ్రంగా గాయపడిన చిన్నారిని కొత్తగూడెం ఆస్పత్రికి తీసుకెళ్లి 15 రోజులపాటు వైద్యం అందించారు. నయం కాకపోగా చిన్నారి విచిత్రంగా ప్రవర్తించడం, నోట్లోనుంచి నురగ రావడంతో ఖమ్మం, అక్కడి నుంచి హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ గత నెల 28న మృతి చెందింది.

కోతులు, కుక్కలను అరికట్టాలి



ఏ వీధి చూసినా కోతులు, కుక్కలు స్వైర విహారం చేస్తున్నాయి. వీధుల్లో తిరిగాలంటే కుక్కలతో భయ భయంగా వెళ్లాల్సి వస్తోంది. ఇక కోతుల ఇళ్లలో చొరబడి సామగ్రి అంతా పారబోస్తున్నాయి. అదిలిస్తే ఎదురుతిరిగి భయపెడుతున్నాయి. జిల్లా ఉన్నతాధికారులు స్పందించి జనావాసాల్లో వీధి కుక్కలు, కోతుల సంచారాన్ని అరికట్టాలి.

–ఎస్‌కే షమీవుద్దీన్, రామవరం

శాశ్వత పరిష్కారం చూపుతాం



కుక్కలు, కోతుల నియంత్రణకు చర్యలు చేపడతాం. వీధి కుక్కలను అరికట్టేలా మున్సిపల్ అధికారులు, పంచాయతీ అధికారులను ఆదేశిస్తాం. గతంలో అటవీశాఖ అధికారులు కోతులను పట్టుకుని అటవీ ప్రాంతంలో వదిలివేయగా, అవి మళ్లీ తిరిగివచ్చాయి. సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి శాశ్వత పరిష్కార చర్యలు చేపడతాం.

–డి.వేణుగోపాల్, అదనపు కలెక్టర్

క్లుప్తంగా

విద్యార్థులకు ఎన్‌సీసీ సర్టిఫికెట్లు


సర్టిఫికెట్లతో విద్యార్థులు

కొత్తగూడెంఅర్బన్: దేశానికి రెండో రక్షణ దళంగా, అనేక సామాజిక కార్యక్రమాలు నిర్వహిస్తూ మరోవైపు చదువులలో రాణిస్తున్న జిల్లాలోని శ్రీ రామచంద్ర డిగ్రీ కళాశాల, సింగరేణి ఉమెన్స్ డిగ్రీ కళాశాలలోని దాదాపు 55 ఎన్‌సీసీ విద్యార్థులకు ఎన్‌సీసీ అకడమిక్ ఇయర్ పూర్తి చేసుకున్న సందర్భంగా శుక్రవారం సర్టిఫికెట్లు అందజేశారు. 11 తెలంగాణ బెటాలియన్ ఎన్‌సీసీ ఆఫీస్ ఖమ్మంలో జరిగిన సర్టిఫికెట్ డిస్ట్రిబ్యూషన్ ప్రోగ్రాంలో విద్యార్థులు కమాండింగ్ ఆఫీసర్ ఎస్‌కే భద్ర నుంచి సర్టిఫికెట్లు అందుకున్నారు. ఈమేరకు విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ పి.పద్మ, డాక్టర్ శారద, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పూర్ణచంద్రరావు, ఎన్‌సీసీ ఆఫీసర్ లెఫ్టినెంట్ శ్రీలత, డాక్టర్ జి.మధు అభినందించారు.

బొగ్గు నాణ్యత పెంపునకు కార్యాచరణ

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ ఉత్పత్తి చేస్తున్న బొగ్గులో జి–15 గ్రేడ్ బొగ్గును థర్మల్ విద్యుత్ కేంద్రాల వారు తీసుకోవడం లేదని, అన్ని ఏరియాలలో జీ–13 గ్రేడ్ బొగ్గును సిద్ధం చేసి రవాణా చేయాలని, ఇది శనివారం నుంచి అమల్లోకి తేవాలని సంస్థ డైరెక్టర్లు వివిధ ఏరియాల జీఎంలకు, ఇతర అధికారులకు డైరెక్టర్ ఆపరేషన్స్ ఎల్‌వీ సూర్యనారాయణ, డైరెక్టర్ పీపీ అండ్(పా) కే.వెంకటేశ్వర్లు శుక్రవారం రాత్రి వీడియో కాన్ఫరెన్స్‌లో ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా నాణ్యతా ప్రమాణాలపై వినియోగదారుల నుంచి వస్తున్న ఫిర్యాదులపై సమీక్షించారు. ఇంధన సరఫరా ఒప్పందం ప్రకారం... ఒప్పకున్న గ్రేడ్ బొగ్గును ఇవ్వకుంటే నష్ట పరిహారం కూడా చెల్లించాల్సిన పరిస్థితి వస్తుందని హెచ్చరించారు.

విత్తన షాపుల తనిఖీ


విత్తన దుకాణంలో తనిఖీ చేస్తున్న అధికారులు

ఇల్లెందు: పట్టణంలోని విత్తన దుకాణాలను శుక్రవారం జిల్లా వ్యవసాయశాఖాధికారి బాబూరావు తనిఖీ చేశారు. స్టాక్ వివరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నిషేధించిన బీటీ–3 పత్తి విత్తనాలు అమ్మితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతీ రైతుకు కొనుగోలు రశీదు ఇవ్వాలని సూచించారు. నిబంధనలు పాటించని వ్యాపారులపై చర్యలు ఉంటాయని తెలిపారు. జిల్లా టెక్నికల్ ఏఓ సాయినారాయణ, మండల వ్యవసాయశాఖ అధికారి సతీష్ తదితరులు పాల్గొన్నారు.



పామాయిల్ గెలలు	
టన్ను ధర	రూ.18,748

విశ్వాసానికి ప్రతీక బక్రీద్

ముస్లింలు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకునే పండుగలలో బక్రీద్ ఒకటి. ఇది ఇస్లామిక్ క్యాలెండర్ ప్రకారం 12వ నెలలోని జుల్ హజ్ మాసంలో పదో రోజున వస్తుంది. త్యాగానికి, భక్తికి, దానధర్మాలకు ప్రతీకగా నిలిచే ఈ పండుగ... అల్లాహ్ పట్ల ప్రవక్త ఇబ్రహీం చూపిన అంకితభావాన్ని, విశ్వాసాన్ని గుర్తు చేస్తుంది. నేడు జిల్లా వ్యాప్తంగా ముస్లింలు పవిత్ర బక్రీద్ పండుగను ఘనంగా జరుపుకోనున్నారు. మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలకు విద్యుత్ దీపాలతో అలంకరించి సిద్ధం చేశారు.

- నేడు ముస్లింల పవిత్ర పండుగ
- హజ్ యాత్ర, ఖుర్బానీకి పరమార్థం
- జిల్లాలో ముస్తాబైన మసీదులు, ఈద్గాలు


ముస్తాబైన కరకగూడెం జామ మస్జీద్

కరకగూడెం/జూలూరుపాడు: బక్రీద్ పండుగ మూలం ఖురాన్ మరియు ఇస్లాం సంప్రదాయాలలో ప్రవక్త ఇబ్రహీం కథతో ముడిపడి ఉంది. దేవుడు ఇబ్రహీం విశ్వాసాన్ని పరీక్షించడానికి తన కుమారుడు ఇస్మాయిల్‌ను బలిదానం చేయమని ఆదేశిస్తాడు. దేవుని ఆజ్ఞకు పాటించేందుకు సిద్ధపడ్డాడు ఇబ్రహీం. అయితే అతని త్యాగ, విధేయతను చూసిన దేవుడు.. ఇస్మాయిల్ స్థానంలో ఒక గొర్రెను బలిదానం చేయమని ఆదేశించాడు. ఈ సంఘటన దేవుని పట్ల అపరిమితమైన విశ్వాసం, విధేయత, త్యాగ భావనను సూచిస్తుంది బక్రీద్ పండుగ. దీనిని జ్ఞాపకం చేసుకుంటూ ముస్లింలు తమ విశ్వాసాన్ని దేవుని పట్ల భక్తిని చాటే అవకాశం అందిస్తుంది. ఈ పండుగ సామాజిక సమానత్వం, సహకారాన్ని ప్రోత్సహిస్తుంది. ఎందుకంటే ఈ సమయంలో బలిదానం చేసిన జంతుమాంసాన్ని మూడు భాగాలుగా విభజించి కుటుంబం, బంధువులు, పేదవారికి పంచుతారు.

హజ్ యాత్రతో పాపాల విముక్తి..

హజ్ యాత్ర ఇస్లాం యొక్క ఐదు స్తంభాలలో ఒకటి మరియు బక్రీద్ పండుగతో దగ్గరి సంబంధం కలిగి ఉంది. ప్రతీ ముస్లిం తన జీవితంలో కనీసం ఒక్కసారైనా చేయవలసిన పవిత్ర యాత్ర. హజ్ యాత్ర మక్కా నగరంలోని కాబా ఆలయం చుట్టూ జరుగుతుంది. ఇది ఇస్లామీయా సంప్రదాయంలో అత్యంత పవిత్రమైన స్థలం. ఈ యాత్రలో పలు ఆచారాలు ఉన్నాయి, కాబా చుట్టూ తవాఫ్ (ప్రదక్షిణ), సఫా మరియు మర్వా కొండల మధ్య సాయి (నడక), అరాఫాత్ రోజున ప్రార్థనలు మరియు మినా వద్ద రాళ్లు రువ్వడం వంటివి ఉన్నాయి. ఈ ఆచారాలు ఇబ్రహీం, అతని భార్య హాజర్ మరియు వారి కుమారుడు ఇస్మాయిల్ జీవితంలోని సంఘటనలను స్మరించుకునేలా రూపొందించబడ్డాయి. ఈ యాత్ర పూర్తి చేసినవారు తన పాపాల నుంచి విముక్తి పొంది, ఆధ్యాత్మికంగా శుద్ధి అవుతారని ముస్లింల నమ్మకం. హజ్ యాత్ర సమయంలో అందరూ ఒకే రకమైన దుస్తులు (ఇహ్రామ్) ధరిస్తారు. ఇది సామాజిక తేడాలను తొలగించి, అందరినీ దేవుని ముందు సమానులుగా చూపిస్తుంది.

త్యాగానికి పరమార్థం ఖుర్బానీ..

ఖుర్బానీ ఇబ్రహీం త్యాగ భావనను స్మరించే ఆచారం. ఈ సందర్భంగా ముస్లింలు గొర్రె, మేక, ఆవు లేదా ఒంటె జంతువును బలిదానం చేస్తారు. మాంసాన్ని మూడు భాగాలుగా విభజించి కుటుంబం, బంధువులు, పేదవారికి పంచుతారు. దీని పరమార్థం కేవలం జంతు బలిదానం మాత్రమే కాదు.. స్వార్థ ఆలోచనలను త్యజించి, సమాజంలోని నిరుపేదలు మరియు అవసరమైన వారి పట్ల దాతృత్వాన్ని ప్రోత్సహిస్తుంది.

విశ్వాసానికి ప్రతీక..



బక్రీద్ పండుగ కేవలం జంతు బలి గురించి కాదు. ప్రవక్త ఇబ్రహీం తన కుమారుడిని త్యాగం చేయడానికి సిద్ధపడటం ద్వారా అల్లాహ్ పట్ల ఆయనకున్న అపారమైన విధేయతను చాటుకున్నారు. ఆ త్యాగ స్ఫూర్తిని గుర్తుచేసుకోవడమే విశ్వాసానికి ప్రతీక. ఖుర్బానీ ద్వారా అహంకారం, దురాశ, స్వార్థాన్ని వదిలేయాలి.

– మొహమ్మద్ ఫిరోజ్, కరకగూడెం

దానధర్మాలను నేర్పుతుంది..



బక్రీద్ అంటే సెలవు దినం కాదు. ఇది మా కుటుంబ సభ్యులు ఆనందంగా గడిపే సమయం. పెద్దలు చెప్పే కథలు వినడం, కొత్త బట్టలు వేసుకోవడం, నమాజ్, పేదలకు సాయం చేయడం వంటివి చేయాలి. ఖుర్బానీ మాంసాన్ని పేదలకు పంచేటప్పుడు కలిగే ఆనందం వెలకట్టలేనిది. ఇది దానధర్మాలను నేర్పుతుంది.

– మొహమ్మద్ సద్దాం, పాల్వంచ

హైకోర్టు జడ్జిని కలిసిన కలెక్టర్

బూర్గంపాడు: హైకోర్టు జడ్జి భీమపాక నగేష్‌ను కలెక్టర్ జితేష్ వి.పాటిల్ శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. భద్రాచలం పర్యటనకు వచ్చిన ఆయనను ఐటీసీ గెస్ట్‌హౌస్‌లో కలిసి పూల మొక్కను అందించారు. అనంతరం జిల్లా పరిస్థితులపై కొద్దిసేపు వారు ముచ్చటించారు.


హైకోర్టు న్యాయమూర్తి నగేష్‌కు పూల మొక్క అందిస్తున్న కలెక్టర్ జితేష్ వి.పాటిల్

వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలి

జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్


మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ భాస్కర్ నాయక్

టేకులపల్లి: వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా సీజనల్ వ్యాధులపై వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ భాస్కర్ నాయక్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సులానగర్ ప్రాథమిక వైద్యశాల ఆవరణలో జరిగిన ఆశా కార్యకర్తలు, వైద్య సిబ్బంది సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. దోమలు పుట్టకుండా ఉండడానికి నీటి నిల్వలను ఎప్పటికప్పుడు తొలగించడం, ప్రతి మంగళ, శుక్రవారం డ్రైడే స్వచ్ఛందంగా నిర్వహించుకునే విధంగా అవగాహన కల్పించాలని సూచించారు. నూతన దంపతులకు తాత్కాలిక కుటుంబ పద్ధతులపై సురక్షిత గర్భస్రావాలపై అవగాహన కల్పించాలని చెప్పారు. లింగ నిర్ధారణ చట్ట వ్యతిరేకమని వీటిని ప్రోత్సహించిన వారు మరియు సహకరించిన వారు శిక్షార్హులని వారిపై క్రిమినల్ చర్యలు ఉంటాయని హెచ్చరించారు. మానసికంగా, బలహీనంగా ఉండి ఒత్తిడిలో ఉన్నవారు, నిరాధరణకు గురై ఒంటరిగా ఉన్నవారు, ప్రేమ మరియు చదువుల్లో విఫలమైన వారు ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, వీటిని నిరోధించడానికి, మానసిక ధైర్యం కల్పించడానికి తెలంగాణ టెలీ మానస్ టోల్ ఫ్రీ హెల్ప్ లైన్ 14416 నంబర్‌పై విస్తృత ప్రచారం చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీడీ జిల్లా ప్రోగ్రాం అధికారి డాక్టర్ మధు వరుణ్, స్థానిక వైద్యాధికారి డాక్టర్ కందుల దినేష్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ వజ్జా పార్వతి, డిప్యూటీ పారామెడికల్ ఆఫీసర్లు పాయం శ్రీను, గన్యా, ఇల్లెందు సబ్ యూనిట్ అధికారి హరికృష్ణ, ఆరోగ్య విస్తరణాధికారి దేవా, ఎన్‌సీడీ కోఆర్డినేటర్ హరి కిషన్, పబ్లిక్ హెల్త్ నర్స్ ఆఫీసర్ చంద్రకళ, సూపర్‌వైజర్లు పోరండ్ల శ్రీనివాస్, నాగుబండి వెంకటేశ్వర్లు, గుజ్జా విజయ, కౌశల్య సింగ్, మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్లు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించండి..


ధర్నా చేస్తున్న నాయకులు, ఉపాధి కూలీలు

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లా వ్యాపితంగా పెండింగ్‌లో ఉన్న ఉపాధి హామీ పథకం కూలీల వేతనాలు వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు మచ్చ వెంకటేశ్వర్లు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం కలెక్టరేట్ వరకు ప్రదర్శన నిర్వహించి ధర్నా చేశారు. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ... కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం బడ్జెట్‌లో నిధులు తగ్గించడం వల్ల పనిదినాలు తగ్గిపోయాయని, వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని విమర్శించారు. జిల్లాలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ఉపాధి పని ప్రదేశాలలో సంఘం కార్యకర్తలు విస్తృత పర్యటనలు చేశారని తెలిపారు. ఈ సందర్భంగా ఉపాధి కూలీల సమస్యలు తెలిసినట్లు చెప్పారు. తాగునీరు, టెంట్, మెడికల్ కిట్లు, రవాణా చార్జీలు లేకుండా ప్రమాదకర పరిస్థితులలో ఉపాధి కూలీలు పనులు చేస్తున్నట్లు చెప్పారు. ప్రభుత్వం వెంటనే ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలని, మౌలిక సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర కమిటీ సభ్యులు అన్నవరపు కనకయ్య, శెట్టి వినోద మాట్లాడుతూ.. ఏజెన్సీ ప్రాంతంలో అడవుల్లో, చెరువులలో పనులు చేస్తున్న కూలీల గురించి పాలకులు పట్టించుకోవడం లేదన్నారు. పట్టాలిచ్చిన పోడు భూముల్లో పనులను అడ్డుకుంటున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కలెక్టరేట్‌లోకి వెళ్లేందుకు ఆందోళనకారులు ప్రయత్నించడంతో పోలీసులు అడ్డుకున్నారు. గ్రామీణాభివృద్ధి అడ్మినిస్ట్రేటివ్ అధికారి ధర్నా వద్దకు వచ్చి వినతిపత్రం స్వీకరించారు. ఈ కార్యక్రమంలో రేపాకుల శ్రీనివాస్, ముదిగొండ రాంబాబు, బత్తుల వెంకటేశ్వర్లు, నిమ్మ వెంకన్న, మర్మం చంద్రయ్య, అలేటి కిరణ్, ఈసం నరసింహారావు, గండమాల భాస్కర్, నాగరత్నమ్మ, పిట్టల నాగమణి పాల్గొన్నారు.

పెద్దమ్మతల్లి ఆలయ ఉద్యోగి మృతి


ప్రమాదానికి కారణమైన లారీ, (ఇన్‌సెట్) మృతుడు సూర్యనారాయణ (ఫైల్)

పాల్వంచరూరల్: లారీ బైక్‌ను ఢీకొట్టిన ప్రమాదంలో పెద్దమ్మతల్లి ఆలయం ఉద్యోగి మృతి చెందాడు. పోలీసుల కథనం.. కేశవాపురం గ్రామానికి చెందిన పెద్దమ్మతల్లి ఆలయంలో రికార్డు అసిస్టెంట్‌గా పనిచేస్తున్న కుంచాల సూర్యనారాయణ (48) శుక్రవారం విధులు ముగించుకుని పాల్వంచకు వెళ్తున్నాడు. ఇందిరానగర్ కాలనీ వద్ద బీసీఎం రహదారిపై పాల్వంచ వస్తున్న లారీ.. వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. అక్కడికక్కడే మృతి చెందాడు. 108 ద్వారా ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. ప్రమాదానికి కారణమైన తూర్పుగోదావరి జిల్లాకు చెందిన లారీ డ్రైవర్ లారీని వదిలేసి పారిపోయాడు. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ టైర్ పేలి వ్యక్తికి తీవ్ర గాయాలు

కరకగూడెం: మండల కేంద్రానికి చెందిన టప్ప సతీష్ టైర్ పంక్చర్ దుకాణం నడుపుతూ జీవిస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం ఓ ట్రాక్టర్ ట్రక్కు టైర్‌కు పంక్చర్ వేసి, గాలి నింపుతున్న సమయంలో ప్రమాదవశాత్తు టైర్ పేలిపోయింది. ఈ క్రమంలో డిస్క్ సతీష్ తలకు, కుడి చేతికి బలంగా తాకింది. కుడి చేయి విరిగి, తలకు తీవ్ర గాయమైంది. స్థానికులు సతీష్‌ను సమీపంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి, మెరుగైన వైద్యం కోసం 108లో మణుగూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు.

132 కేజీల గంజాయి పట్టివేత


పట్టుకున్న గంజాయితో ఎస్సై మధుప్రసాద్, సిబ్బంది

అశ్వాపురం: గొల్లగూడెం వద్ద అశ్వాపురం పోలీసులు గంజాయిని పట్టుకున్నారు. వివరాలు.. ఎస్సై మధుప్రసాద్ ఆధ్వర్యంలో శుక్రవారం పోలీసులు వాహనాల తనిఖీలు చేస్తుండగా గొల్లగూడెం సీ తారామ కెనాల్ వంతెన వద్ద కారులో వెనుక సీట్‌లో అక్రమంగా తరలిస్తున్న 132కేజీల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని చింతూరు నుంచి మహారాష్ట్రలోని నాందేడ్‌కు తరలిస్తున్న సిద్దిపేటకు జిల్లాకు చెందిన పల్లెపు పరుశురాములును పోలీసులు రిమాండ్‌కు తరలించినట్లు సీఐ అశోక్‌రెడ్డి తెలిపారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

చండ్రుగొండ: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతూ ఓ వ్యక్తి శుక్రవారం మృతి చెందినట్లు హెడ్‌కానిస్టేబుల్ రవి తెలిపారు. వివరాలు.. కొమ్ములగూడేనికి చెందిన నోముల కొండయ్య (38) గురువారం తుంగారం నుంచి గానుగపాడు గ్రామానికి ద్విచక్రవాహనంపై వెళ్తుండగా రేపల్లెవాడ గ్రామంలో మలుపు వద్ద అదుపు తప్పింది. ఈ క్రమంలో చెట్టు కొమ్మకు బలంగా ఢీకొన్నాడు. తలకు గాయం కావడంతో చికిత్స నిమిత్తం కొత్తగూడెం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శుక్రవారం మృతి చెందాడు. భార్య వెంకటమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

దామరచర్లలో మహిళ..

చండ్రుగొండ: దామరచర్ల గ్రామానికి చెందిన బన్నె లక్ష్మి (55) శుక్రవారం మృతి చెందింది. పోలీసుల కథనం .. లక్ష్మికి ముగ్గురు కూతుళ్లు. అందరికీ వివాహాలు చేసింది. చిన్న కుమార్తె శ్రీలత భర్తతో గొడవ పడి పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో కుమార్తెను తల్లి లక్ష్మి నచ్చజెప్పేందుకు ప్రయత్నించింది. వినకపోవడంతో తల్లి లక్ష్మి ఈ నెల 2న ఉరి వేసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. కుటుంబీకులు చూసి ఆమెను కాపాడారు. గొంతు నొప్పిగా ఉండడంతో ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ మృతి చెందింది. పెద్ద కుమార్తె కృష్ణవేణి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు హెడ్‌కానిస్టేబుల్ వెంకటేశ్వర్లు తెలిపారు.

కల్వర్టు నిర్మాణానికి నిధులు విడుదల

దుమ్ముగూడెం: తూరుబాక గ్రామంలోని చర్ల – భద్రాచలం ప్రధాన రహదారిపై కల్వర్టు నిర్మాణానికి ప్రభుత్వం రూ.2.70 కోట్ల నిధులు విడుదల చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. కల్వర్టు కుంగిపోయి ప్రమాదకరంగా మారింది. ఈ క్రమంలో ఐదుగురు ప్రయాణికులు మృతి చెందడంతో పాటు పలువురు క్షతగాత్రులు కావడంతో సాక్షి తో పాటు పలు పత్రికల్లో కథనాలు ప్రచురితం అయ్యాయి. దీంతో భద్రాచలం ఎమ్మెల్యే డాక్టర్ తెల్లం వెంకట్రావు సొంత మండలం కావడంతో ప్రత్యేక చొరవ తీసుకుని నిధులు మంజూరు చేయించారు. నిత్యం వేల వాహనాలు ఈ రహదారి గుండా ప్రయాణిస్తుంటాయి. అందులో ప్రముఖ పుణ్యక్షేత్రమైన పర్ణశాల, నర్సాపురం, ద్వాదశ జ్యోతిర్లింగ ఆలయ దర్శనానికి భక్తులు వచ్చిపోతుంటారు. అంతేకాక భద్రాచలం నుంచి వాజేడు మండలం పేరూరు, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి నిత్యం వాహనాలు వెళ్తుంటాయి. ఈ క్రమంలో వాహనాలు డైవర్షన్ రోడ్డులో వెళ్తున్నాయి. ప్రభుత్వం నిధులు విడుదల చేయడంతో.. పనులు త్వరగా ప్రారంభించి నిర్మాణ పనులు పూర్తి చేయాలని పలువురు వాహనదారులు కోరుతున్నారు.

సస్పెన్షన్ ఎత్తివేత

భద్రాచలం: భద్రాచలం శ్రీసీతారామచంద్ర స్వామి వారి దేవస్థానంలో ప్రధాన అర్చకుడు పొడిచేటి సీతారామనుజాచార్యులుపై ఉన్న సస్పెన్షన్‌ను దేవాదాయ శాఖ కమిషనర్ శుక్రవారం ఎత్తివేశారు. కొద్ది నెలల క్రితం వరకు ఆలయంలో విధులు నిర్వర్తించిన ఆయనపై ఆరోపణలు వచ్చాయి. దీంతో విచారణ అనంతరం ఆయనను సస్పెండ్ చేశారు. ప్రస్తుతం సస్పెన్షన్ తొలగించగా.. విధుల్లో చేరినప్పటికీ విచారణ కొనసాగుతుందని అధికారులు పేర్కొన్నారు.

103 శాతం బొగ్గు ఉత్పత్తి

ఐదు ఏరియాల్లో 100 శాతం


ఓపెన్ కాస్ట్ గనిలో బొగ్గు లోడ్ చేస్తున్న దృశ్యం

సింగరేణి(కొత్తగూడెం): సింగరేణి సంస్థ 2025–26 ఆర్థిక సంవత్సరంలో 76 మిలియన్ టన్నుల బొగ్గు ఉత్పత్తి లక్ష్యంగా పెట్టుకుంది. ఈ నేపథ్యంలో మే నెలలో సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11ఏరియాల్లోని 19 ఓపెన్‌కాస్ట్ గనులకు, 21భూగర్భ గనులకు 56.50 మిలియన్ లక్షలటన్నుల లక్ష్యానికి 58.22 లక్షల టన్నులు 103 శాతం మాత్రమే సాధించినట్లు సింగరేణి తన గణాంకాల్లో తెలిపింది. కాగా సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11ఏరియాల్లోని భూగర్భగనుల్లో 4.90లక్షల టన్నుల లక్ష్యానికి 3.50లక్షల టన్నులు 72శాతం ఉత్పత్తి చేయగా, ఓపెన్ కాస్ట్ గనుల్లో 51.60 లక్షల టన్నులకు గాను 54.72 లక్షల టన్నులు 106 శాతం సాధించింది. ఓవరాల్‌గా 56.50 లక్షల టన్నుల లక్ష్యానికి 58.22లక్షల టన్నులు 103శాతం ఉత్పత్తి జరిగింది.

మే మాసంలో మెరుగైన ఉత్పత్తి...

గడచిన ఏప్రిల్‌లో సాధించిన ఉత్పత్తి (95శాతం) కంటే మే లో 103 శాతం అంటే 8 శాతం (నెలవారీ ఉత్పత్తి) అదనంగా ఉత్పత్తి జరిగింది. అంతేకాకుండా ఏప్రిల్‌లో మణుగూరు ఏరియా 10.88 లక్షల టన్నులు సాధించి మొదటి స్థానంలో నిలవగా, ఆర్జీ–2 ఏరియా 4.99 లక్షల టన్నులు సాధించి రెండో స్థానంలో నిలిచింది. మే నెలలో 5 ఏరియాలు (కొత్తగూడెం 107 శాతం, మణుగూరు 119 శాతం, శ్రీరాంపూర్ 100 శాతం, ఆర్జీ–2 133 శాతం, ఆర్జీ–3 100 శాతం,) 100 శాతం సాధించాయి. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లోని భూగర్భ గనులు, ఓపెన్ కాస్ట్ గనుల్లో 49.90 లక్షల టన్నులు 95 శాతం సాధించగా, మే లో 10.81 లక్షల టన్నులు 99శాతం అంటే గతంలో కంటే మరో 4శాతం అదనంగా సాధించింది.

తీరు మార్చుకోని ఆరు ఏరియాలు..

సింగరేణి వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో మే మాసంలో ఐదు ఏరియాలు మాత్రమే 100 శాతం ఉత్పత్తి సాధించగా, మిగిలిన ఆరు ఏరియాలు వెనుకంజలో ఉన్నాయి. అయితే సింగరేణి సంస్థ ఉన్నతాధికారులు ఏరియాలలోని భూగర్భ, ఓపెన్ కాస్ట్ గనులకు నిర్దేశించిన నెలవారి, వార్షిక లక్ష్యాలను కచ్చితంగా సాధించాలని రివ్యూ మీటింగ్‌లలో పలుమార్లు చెప్పినప్పటికీ అధికారుల పనితీరులో మార్పు రాలేదు.

కొత్తగూడెం ముందంజ...

మే మాసంలో కొత్తగూడెం ఏరియా 107శాతం, వార్షిక లక్ష్యం 100శాతం సాధించగా, మణుగూరు ఏరియా మే నెలలో 119శాతం, వార్షిక లక్ష్యంలో 118శాతం సాధించినప్పటికీ ఓవరాల్‌గా కొత్తగూడెం ఏరియా 13.96 లక్షల టన్నులు, వార్షిక లక్ష్యం 26.04 లక్షల టన్నులు సాధించి సింగరేణి వ్యాప్తంగా అగ్రస్థానంలో ఉండగా, మణుగూరు ఏరియా మేలో 11.74 లక్షల టన్నులు, వార్షిక లక్ష్యంలో 22.63 లక్షల టన్నులు సాధించి రెండో స్థానంలో నిలిచాయి. కంపెనీ రెండు నెలలో 108 లక్షల్లో కొత్తగూడెం రీజియన్ 53 లక్షలు సాధించటం విశేషం. అయితే మిగతా రెండు రీజియన్‌లు 55 లక్షల టన్నులు సాధించటం గమనార్హం. కాగా, ఆర్జీ–2 ఏరియా మే నెలలో 133 శాతం, రెండు నెలలో 159 శాతం సాధించి మూడు స్థానంలో ఉంది.

ఉన్నతాధికారులు సమీక్షించాలి..



ప్రతీ మంగళ, శనివారం సింగరేణిభవన్ నుంచి సీఎండీ వివిధ విభాగాల డైరెక్టర్లు, జీఎంలతో బొగ్గు ఉత్పత్తిపై చర్చిస్తున్నారు. అయితే వాటి అమలుపై ఉన్నతాధికారులు సమీక్షించాలి. ఏ నెలలో ఏ గనిలో ఉత్పత్తి తగ్గిందో కారణాలు తెలుసుకోవాలి. సమస్యలను పరిష్కరిస్తే ఉత్పత్తి మెరుగవుతుంది.

– రియాజ్ అహ్మద్, హెచ్ ఎంఎస్ జనరల్ సెక్రటరీ

పనిగంటలు పెంచితే లక్ష్యం సాధించవచ్చు..



ఓపెన్ కాస్ట్ గనుల్లో 66 శవల్స్ రోజుకు 19 గంటలు నడువాల్సింది 12 గంటలు అంటే 74 శాతం మాత్రమే నడుస్తున్నాయి. 425 డంపర్లు 18 గంటలు పనిచేయాల్సి ఉండగా, 8 గంటలు మాత్రమే పనిచేస్తున్నాయి. 48డ్రిల్స్ 20 గంటలకు 5 గంటలే పనిచేస్తున్నాయి. ఇది మారితే లక్ష్యంసాధించవచ్చు.

– వెంకటేశ్వర్లు ప్రాజెక్ట్, ప్లానింగ్ డైరెక్టర్

రెండు లారీలు ఢీ.. డ్రైవర్‌కు తీవ్ర గాయాలు


లారీని తొలగిస్తున్న జేసీబీ

అశ్వారావుపేటరూరల్: వేగంగా వస్తున్న రెండు లారీలు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్నాయి. స్థానిక ఎస్సై యయాతిరాజు కథనం ప్రకారం.. శుక్రవారం హైదారాబాద్ నుంచి ఏపీలోని ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడేనికి సరుకుల లోడుతో వెళ్తున్న లారీ, ఏపీలోని రాజమండ్రి నుంచి సూర్యాపేట వస్తున్న మరో లారీ.. అశ్వారావుపేట మండలం నారంవారిగూడెం సమీపంలో పామాయిల్ ఫ్యాక్టరీ వద్ద అదుపు తప్పి ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో తాడేపల్లిగూడేనికి చెందిన లారీ డ్రైవర్ నాగమల్లేశ్వరరావుకు తీవ్రగాయాలు కాగా, స్థానికులు అశ్వారావుపేట ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికు తరలించారు. ఈ ఘటనలో జాతీయ రహదారిపై అడ్డంగా బోల్తా పడిన లారీతో వాహనాల రాకపోకలకు కొద్దిసేపు అంతరాయం ఏర్పడింది. జేసీబీల సాయంతో లారీని పక్కకు తొలగించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో జరిమానా

సూపర్‌బజార్(కొత్తగూడెం): అతిగా మద్యం తాగి వాహనాలు నడిపిన కేసులలో శుక్రవారం కొత్తగూడెం కోర్టులో 26 మందికి జరిమానా విధిస్తూ స్పెషల్ జ్యుడీషియల్ సెకండ్ క్లాస్ మెజిస్ట్రేట్ మెండు రాజమల్లు తీర్పు చెప్పారు. కొత్తగూడెం వన్‌టౌన్ ఎస్ఐ తుంగ రాజేష్ తెలిపిన వివరాలు.. ట్రాఫిక్ ఎస్ఐ కె.నరేష్ పర్యవేక్షణలో వాహనాల తనఖీలు నిర్వహిస్తుండగా పది మంది, పాల్వంచ టౌన్ ఎస్‌హెచ్ఓకు సుమన్ వాహన తనఖీలు చేస్తుండగా ఒకరు, కొత్తగూడెం టూటౌన్ ఎస్‌హెచ్ఓ టి.రమేష్‌కుమార్, ఎస్ఐలు మహ్మద్ కేఎం ఆలీఖాన్, బి.కిషోర్ అప్పటి సబ్ ఇన్‌స్పెక్టర్ ఎం.సెల్వరాజ్ తమ బృందంతో వాహన తనఖీలు నిర్వహిస్తుండగా.. 15మంది మొత్తం 26 మంది మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడ్డారు. బ్రీత్ ఎనలైజర్ ద్వారా పరీక్షించగా మద్యం సేవించినట్లు నిర్ధారణ అయింది. ఈ కేసులు కోర్టులో రుజువు కావడంతో జరిమానా విధించారు. వీరంతా జరిమానా చెల్లించారు.

అర్ధరాత్రి అపరిచితుడి సంచారం

అశ్వారావుపేటరూరల్: వినాయకపురం కాలనీ గ్రామంలో గురువారం అర్ధరాత్రి సంచరిస్తున్న 60 ఏళ్ల వృద్ధుడిని దొంగ అనే అనుమానంతో గ్రామస్తులు పట్టుకున్నారు. వృద్ధుడు పొంతన లేని సమాధానాలు చెప్పడంతో అతడిని విద్యుత్ స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఘటన స్థలానికి వచ్చిన స్థానిక అదనపు ఎస్సై రామ్మూర్తి, సిబ్బంది కలిసి అదుపులోకి తీసుకోని విచారణ చేపట్టారు. కాగా, మతిస్థిమితం లేని వృద్ధుడిగా గుర్తించి వదిలేసినట్లు పోలీసులు తెలిపారు.

గల్లంతైన యువకుడి కోసం గాలింపు


గోదావరిలో గాలింపు చేపడుతున్న రెస్క్యూ టీమ్

బూర్గంపాడు: ఇరవెండి వద్ద గోదావరిలో గురువారం గల్లంతైన సారపాకకు చెందిన భోగపతి సావంత్ ఆచూకీ కోసం శుక్రవారం కూడా గాలింపు కొనసాగింది. పోలీసులు, రెస్క్యూ టీమ్, గజ ఈతగాళ్లు గోదావరిలో గాలింపు చర్యలు చేపట్టారు. సాయంత్రం వరకు ఎలాంటి ఆచూకీ లభించలేదు. శనివారం కూడా గాలింపు చర్యలు కొనసాగిస్తామని ఎస్ఐ రాజేశ్ తెలిపారు.